బాలరాముడి దివ్యరూపం

తొలిసారి బయటకు వచ్చిన రామ్‌లల్లా విగ్రహ ఫొటోలు

ఒక చేతిలో బంగారు విల్లు, మరో చేతిలో బాణం

అయోధ్య/న్యూఢిల్లీ, జనవరి 19: అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తికావొచ్చాయి. ఈ నెల 22న జరుగనున్న ప్రాణప్రతిష్ఠకు మూడు రోజుల ముందే ఆలయ గర్భగుడిలో ప్రతిష్ఠించే రామ్‌లల్లా విగ్రహం పూర్తి ఫొటో శుక్రవారం బయటకొచ్చింది. మొదటి సారిగా విడుదలైన ఈ చిత్రం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నది. కండ్లకు పసుపు వస్త్రం కట్టి, మెడలో రోజా పూలమాల ఉన్న బాలరాముడి చిత్రాన్ని వీహెచ్‌పీ ఉదయం విడుదల చేయగా.. మధ్యాహ్నం తర్వాత రామ్‌లల్లా పూర్తి రూపంతో కూడిన ఫొటో ఒకటి బయటకు వచ్చింది. ఈ చిత్రంలో ఐదేండ్ల రాముడు ఒక చేతిలో బంగారు విల్లు, మరో చేతిలో బాణం ధరించి ఉన్నాడు. కృష్ణ శిలపై చెక్కిన బాలరాముడి విగ్రహంలో ఆధ్యాత్మిక వైభవం ఉట్టిపడుతున్నదని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. 51 అంగుళాల ఈ విగ్రహాన్ని కర్ణాటకలోని మైసూర్‌కు చెందిన అరుణ్ యోగిరాజ్ అనే శిల్పి చెక్కాడు.

అయోధ్య తీర్పు 'ధర్మాసనానికి' ఆహ్వానం

అయోధ్య వివాదంపై తీర్పు నివ్వడం ద్వారా ఆలయ నిర్మాణానికి మార్గం సుగమం చేసిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనంలోని ఐదుగురు న్యాయమూర్తులకు కూడా ఈ నెల 22న జరిగే ప్రారంభోత్సవానికి ఆహ్వానాలు అందాయి. దశాబ్దాల వివాదానికి తెరదించుతూ ఐదుగురు సభ్యుల బెంచ్ 2019, నవంబర్ 9న చరిత్రాత్మక తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. ఆలయ ప్రారంభోత్సవ ఆహ్వానాలు అందుకొన్న వారిలో ప్రస్తుత సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, మాజీ సీజేఐలు రంజన్ గొగోయ్, ఎస్ఏ బాబ్డే, మాజీ న్యాయమూర్తులు అశోక్ భూషణ్, ఎస్ అబ్దుల్ నజీర్ ఉన్నారు.

రాములోరికి కానుకల వెల్లువ

అయోధ్య రామాలయం ప్రారంభోత్సవం సమీపిస్తున్న క్రమంలో రాముడికి దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి బహుమతులు వెల్లువలా వస్తున్నాయి. మధ్యప్రదేశ్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రం ఉజ్జయిని మహాకాలేశ్వర్ ఆలయంలో తయారు చేసిన 5 లక్షల లడ్డూలు శుక్రవారం అయోధ్యకు బయలుదేరాయి. లడ్డూలను తీసుకెళ్తున్న ఐదు ట్రక్కులకు సీఎం మోహన్ యాదవ్ పచ్చజెండా ఊపారు. ప్రస్తుత కర్ణాటకలోని హంపి రీజియన్‌లో ఉన్న హనుమంతుడి జన్మస్థలంగా చెప్పే కిష్కింద నుంచి ఒక రథం శుక్రవారం అయోధ్య చేరుకొన్నది. ఇంకా ఆలయానికి సుగంధ ద్రవ్యాలు, రాముడి బొమ్మతో అలంకరించిన కంకణాలు, స్వీట్లు, 500 కేజీల ఐరన్-కాపర్ ఊరేగింపు వాహనం, బియ్యం, కూరగాయలు వంటివి వస్తూనే ఉన్నాయి. మహారాష్ట్రలోని అమరావతి నుంచి 500 కిలోల కుంకుమ బయలుదేరింది.

వాకింగ్, సైక్లింగ్, స్కేటింగ్ చేస్తూ..

ఆలయ ప్రారంభోత్సవం నేపథ్యంలో అన్ని దారులు అయోధ్య వైపే ఉన్నాయి. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి ప్రజలు మతాలకు అతీతంగా అయోధ్య చేరుకొనే పనిలో పడ్డారు. ఈ క్రమంలో కొంతమంది భక్తులు సుదూరాలను కవర్ చేస్తూ, ఎముకలు కొరికే చలిని తట్టుకొంటూ వాకింగ్ సహా సైక్లింగ్, స్కేటింగ్ వంటి సాహస యాత్రల రూపంలో బయలుదేరారు. బీహార్‌కు చెందిన నితీశ్ కుమార్ అనే వ్యక్తి 615 కిలోమీటర్లకు పైగా సైకిల్ తొక్కుకుంటూ అయోధ్యకు చేరుకొన్నాడు. సుప్రీంకోర్టు తీర్పు సమయంలోనే తాను ఈ నిర్ణయం తీసుకొన్నానని అతను పేర్కొన్నాడు. 124 గంటల పాటు డ్యాన్స్ చేసి గిన్నెస్ రికార్డు సాధించిన సోనీ చౌరిసియా ఆహ్వానితుల జాబితాలో ఉన్నారు. ఆమె వారణాసి నుంచి అయోధ్యకు 17న స్కేటింగ్‌పై బయలుదేరారు. మతసామరస్యాన్ని, హిందూ-ముస్లిం ఐక్యతను చాటుతూ మహారాష్ట్రకు చెందిన షేక్ షబ్నాం ముంబై నుంచి అయోధ్యకు 1,400 కిలోమీటర్ల మేర కాలినడకన బయలుదేరారు.

ఎన్డీఆర్ఎఫ్ బృందాల మోహరింపు

అయోధ్య ఆలయ ప్రారంభోత్సవానికి భారీ సంఖ్యలో భద్రతా సిబ్బందిని మోహరించనున్నారు. ఏ విధమైన సమస్య, విపత్తు తలెత్తినా ఎదుర్కొనేందుకు పలు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, వారికి సాయంగా 'హజ్మాత్' వాహనాలను కేటాయించినట్టు ఎన్డీఆర్ఎఫ్ డీజీ కర్వాల్ పేర్కొన్నారు. వీరికి రసాయన, జీవ, రేడియో ధార్మిక, అణు దాడులను ఎదుర్కోవడంతో పాటు భూకంపాలు వంటి విపత్తు సమయంలో తగిన విధంగా స్పందించే నైపుణ్యం ఉన్నదని తెలిపారు.

22న పలు రాష్ట్రాల్లో సెలవు

రాముడి ప్రతిష్ఠాపన కార్యక్రమం నేపథ్యంలో పలు రాష్ట్రాలు, యూటీల్లో ప్రభుత్వాలు ఈనెల 22న సెలవు ప్రకటించాయి. ఇప్పటి వరకు మహారాష్ట్ర, హర్యానా, ఉత్తరాఖండ్, యూటీలు పుదుచ్చేరి, చండీగఢ్ ఆ రోజున పబ్లిక్ హాలిడే ప్రకటించగా.. కేరళ, అస్సాం, ఒడిశా, రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, త్రిపురలో ప్రభుత్వ కార్యాలయాలకు సగం రోజు సెలవు ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే దేశవ్యాప్తంగా ఉన్న తన అన్ని కార్యాలయాలు, సంస్థలు, పరిశ్రమలకు సగం రోజు సెలవు ప్రకటించిన విషయం తెలిసిందే.

శిల్పకళ పై మక్కువతో ఉద్యోగం వీడి..

అయోధ్య ఆలయంలో కొలువుదీరనున్న బాలరాముడి విగ్రహాన్ని చెక్కిన శిల్పి అరుణ్ యోగిరాజ్ గురించి ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చ నడుస్తున్నది. కర్ణాటకలో మైసూర్‌లోని శిల్ప కళా కుటుంబానికి చెందిన యోగిరాజ్ దేశంలోనే ప్రముఖ శిల్పిగా పేరుపొందాడు. యుక్త వయసులోనే అతను శిల్ప ప్రపంచంలోకి ప్రవేశించాడు. అతని నైపుణ్యమే రామ్‌లల్లా విగ్రహాన్ని మలిచే అదృష్టం వచ్చేలా చేసింది. 1983లో జన్మించిన యోగిరాజ్.. ఎంబీఏ పూర్తి చేశాడు. మొదట కార్పొరేట్ ఉద్యోగంలో చేరినా.. తన కుటుంబ మూలమైన శిల్పకళపై అతనికి ఉన్న మక్కువ అతన్ని 2008లో ఆ వైపు వెళ్లేలా చేసింది. ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద ఆకర్షణీయంగా ఉండే 30 అడుగుల పొడవైన నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహంతోపాటు కేదార్‌నాథ్‌లో ప్రతిష్ఠించిన 12 అడుగుల ఆది శంకరాచార్య విగ్రహాన్ని కూడా యోగిరాజ్ చెక్కారు. ఇంకా దేశంలోని పలుచోట్ల ఆయన ఆధ్వర్యంలో రూపుదిద్దుకొన్న శిల్పాలు ప్రతిష్ఠించారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆయన పలు అవార్డులు, సత్కారాలు పొందారు.

సర్కిల్ గీస్తే సమాచారం ప్రత్యక్షం!

- ఇంటర్నెట్ శోధనకు గూగుల్ కొత్త ఫీచర్లు
- ప్రీమియం ఫోన్లకు మాత్రమే పరిమితం

వాషింగ్టన్, జనవరి 19: ఇంటర్నెట్‌లో సమాచార శోధనను మరింత సులభతరం చేసేందుకు ప్రముఖ సెర్చింజిన్ గూగుల్ తన ప్రీమియం డివైజ్‌లలో కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతతో పనిచేసే రెండు సరికొత్త ఫీచర్లను ప్రవేశపెట్టింది. వీటిలో 'సర్కిల్ టు సెర్చ్', 'లెన్స్' ఫీచర్లు ఉన్నాయి. ఆండ్రాయిడ్ ఫోన్లలో స్క్రీన్‌పై కనిపించే ఫొటో, వీడియో, టెక్స్ట్‌పై వృత్తాన్ని (సర్కిల్‌ను) గీయడం, హైలైట్, స్క్రిబిల్ చేయడం ద్వారా వాటికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు 'సర్కిల్ టు సెర్చ్' ఫీచర్ ఉపకరిస్తుంది. బుధవారం విడుదలైన శాంసంగ్ గెలాక్సీ ఎస్-24 సిరీస్ ఫోన్లలో అందుబాటులోకి తెచ్చిన ఈ ఫీచర్‌ను త్వరలో పిక్సెల్ 8, పిక్సెల్ 8 ప్రో సహా ఇతర ప్రీమియం ఆండ్రాయిడ్ ఫోన్లలోనూ ప్రవేశపెట్టనున్నట్టు గూగుల్ స్పష్టం చేసింది. 'లెన్స్' ఫీచర్ ద్వారా ఫోన్ కెమెరాలో ఏదైనా వస్తువును లేదా ప్రదేశాన్ని కవర్ చేస్తూ దానికి సంబంధించిన ఎలాంటి ప్రశ్ననైనా అడిగి సమాచారాన్ని పొందవచ్చు. ఫొటోలు లేదా స్క్రీన్‌షాట్లను అప్‌లోడ్ చేయడం ద్వారా కూడా వాటి సంబంధించిన వివరాలను తెలుసుకోవచ్చు.

2,800 మంది టాటా స్టీల్ ఉద్యోగులపై వేటు!

లండన్: బ్రిటన్‌లోని సౌత్ వేల్స్, పోర్ట్ టాల్బోట్ ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్‌లను మూసివేయాలని టాటా స్టీల్ నిర్ణయించింది. దీంతో దాదాపు 2,800 మంది ఉద్యోగాలు కోల్పోబోతున్నారు. రానున్న 18 నెలల్లో 2,500 మందిని తొలగిస్తామని, మిగిలిన వారిని రానున్న మూడేళ్లలో తొలగిస్తామని ఆ సంస్థ తెలిపింది. దీని కోసం అవసరమైన చట్టపరమైన సంప్రదింపులను ప్రారంభించనున్నట్లు తెలిపింది. స్వచ్ఛందంగా వైదొలగడాన్ని ప్రోత్సహిస్తామని, బాధిత ఉద్యోగులకు సపోర్ట్ ప్యాకేజ్ కోసం 130 మిలియన్ పౌండ్లను ఖర్చు చేస్తామని తెలిపింది.

అమెజాన్‌లో మళ్లీ ఉద్యోగుల కోత

శాన్ ఫ్రాన్సిస్కో, జనవరి 19: తమ 'బై విత్ ప్రైమ్' యూనిట్‌లో 5 శాతం ఉద్యోగులను తగ్గిస్తున్నట్టు అమెజాన్ తాజాగా వెల్లడించింది. తరచూ తమ బృందాల నిర్మాణాన్ని, వ్యాపారాన్ని, అవసరాలను సమీక్షించి కొద్ది మంది ఉద్యోగులను తొలగించాలన్న కఠిన నిర్ణయాన్ని తీసుకొంటామని అమెజాన్ అధికార ప్రతినిధి తెలిపారు. తొలగించిన ఉద్యోగులు తమ కంపెనీలోనే కొత్త ఉద్యోగాలు వెతుక్కోవడానికి సాయం చేస్తున్నామని అమెజాన్ తెలిపింది. గత వారం నాలుగు విభాగాల్లో వందలాది ఉద్యోగులను అమెజాన్ తొలగించింది.

నిల్చొని తింటే క్యాన్సర్ ముప్పు

లక్నో, జనవరి 19: నిల్చొని తింటున్నారా? అయితే క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉన్నదని అంటున్నారు శాస్త్రవేత్తలు. నిల్చొని తినటం వల్ల పొట్ట సంబంధిత, పేగు సంబంధిత క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయని చెప్తున్నారు. లక్నోలోని కల్యాణ్‌సింగ్ సూపర్ స్పెషాలిటీ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన రేడియోథెరపీ విభాగ అధిపతి రాకేశ్ కపూర్ ఆధ్వర్యంలోని బృందం నిల్చొని తినటం వల్ల కలిగే అనర్థాలపై పరిశోధనలు చేసింది. ఈ పరిశోధనల్లో నిల్చొని తిన్నప్పుడు అన్నవాహిక సంబంధిత వ్యాధులు వస్తాయని తేలింది. నిల్చొని నీళ్లు తాగినా ఈ సమస్య వస్తుందని గుర్తించారు. నిల్చొని తిన్నా, నీళ్లు తాగినా అన్నవాహిక కండరాల పనితీరుకు అడ్డు తగిలి జీర్ణక్రియ పనితీరుపై ప్రభావం పడుతుందని పరిశోధకులు వివరించారు. ఈ పరిస్థితి రానురానూ అన్నవాహిక క్యాన్సర్‌కు దారితీస్తుందని వెల్లడించారు. అదేవిధంగా, జీవితంలో ఎదిగే క్రమంలో మహిళలు పెండ్లిని ఆలస్యం చేస్తున్నారని, దీని ప్రభావంతో వారిలో రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉన్నదని పేర్కొన్నారు.

ప్రాముఖ్యం ఇవ్వకపోతే ఒంటరిగానే పోటీ

కోల్‌కతా, జనవరి 19: రాబోయే లోక్‌సభ ఎన్నికలలో సీట్ల పంపకంపై ఇండియా కూటమిలో తీవ్ర స్థాయిలో విభేదాలు తలెత్తినట్టు ప్రచారం జరుగుతుండగా, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తమ పార్టీ కార్యకర్తల సమావేశంలో సంచలన ప్రకటన చేశారు. సీట్ల కేటాయింపులో తమకు తగిన ప్రాముఖ్యం ఇవ్వకపోతే రాష్ట్రంలోని 42 సీట్లలో పార్టీ సొంతంగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉండాలని ఆమె పిలుపునిచ్చారు. ముర్షిదాబాద్‌లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ జిల్లాలోని మూడు ఎంపీ సీట్లను గెల్చుకోవాలని మమత పిలుపునిచ్చారని పేరును వెల్లడించని ఒక టీఎంసీ నేత తెలిపారు. ఇండియా కూటమిలో టీఎంసీ ముఖ్యమైన పార్టీ అని, అయితే దానికి విరుద్ధంగా సీట్ల సర్దుబాటులో ఆర్ఎస్‌పీ, సీపీఐ, సీపీఎంలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని ఆమె ఆరోపించారన్నారు. అలాంటి పరిస్థితుల్లో తమ దారి తాము చూసుకుందామని, 42 సీట్లలో బరిలో దిగేందుకు సిద్ధంగా ఉండాలని ఆమె కోరినట్టు ఆ నేత తెలిపారు.

యూపీలో ఎస్పీ-ఆర్ఎల్డీ పొత్తు ఖరారు

జయంత్ పార్టీకి ఏడు సీట్ల కేటాయింపు

లక్నో, జనవరి 19: ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్ఎల్డీ) మధ్య శుక్రవారం పొత్తు కుదిరింది. వచ్చే సార్వత్రిక ఎన్నికలలో రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తాయని ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, ఆర్ఎల్డీ అధ్యక్షుడు జయంత్ చౌదరి శుక్రవారం సామాజిక మాధ్యమంలో ప్రకటించారు. ఎన్నికలకు సంబంధించి ఇరు పార్టీల మధ్య సీట్ల కేటాయింపుపై ఒప్పందం కుదిరిందని, తమ పార్టీకి పశ్చిమ యూపీలో ఏడు సీట్లను కేటాయించినట్టు ఆర్ఎల్డీ ప్రతినిధి ఒకరు తెలిపారు. అయితే ఏయే స్థానాల్లో పోటీ చేసేదీ ఆయన వెల్లడించ లేదు.

'జమిలి ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధం'

న్యూఢిల్లీ, జనవరి 19: జమిలి ఎన్నికలు అప్రజాస్వామికమని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. రాజ్యాంగ మౌలిక నిర్మాణానికి ఇది విరుద్ధమని తెలిపింది. జమిలి ఎన్నికలపై అభిప్రాయాలు కోరిన ఉన్నత స్థాయి కమిటీకి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ మేరకు లేఖ రాశారు. 'ఈ ఆలోచనను వదిలిపెట్టండి. ఇందుకోసం ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీని రద్దు చేయండి. మీరు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్టు కనిపిస్తున్నది. మీరు చేస్తున్న సంప్రదింపుల్లో నిజాయతీ లేనట్టు అనిపిస్తున్నది. ప్రభుత్వం, పార్లమెంట్, ఎన్నికల సంఘం ప్రజల తీర్పును గౌరవించాలే కానీ ఇలాంటి అప్రజాస్వామిక ఆలోచనలతో వారి దృష్టిని మరల్చకూడదు' అని ఖర్గే అన్నారు.

లాలూ, తేజస్వికి మరోసారి ఈడీ నోటీసులు

పాట్నా, జనవరి 19: ల్యాండ్ ఫర్ జాబ్ కేసులో బీహార్ మాజీ సీఎం, ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్, అతని కుమారుడు, బీహార్ డిప్యూటీ సీఎం తేజస్వి యాదవ్‌కు ఈడీ మరోసారి సమన్లు జారీ చేసింది. ఇంతకుముందు సమన్లు జారీచేసినా వీరు విచారణకు హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 29న లాలూ ప్రసాద్, 30న తేజస్వి యాదవ్ పాట్నాలోని తమ కార్యాలయం ముందు విచారణకు హాజరు కావాలని ఈడీ మరోసారి నోటీసులు ఇచ్చింది. లాలూ ప్రసాద్ యాదవ్ రైల్వే మంత్రిగా ఉండగా ఈ కుంభకోణం జరిగినట్టు ఈడీ ఆరోపించింది.

సుప్రీంకోర్టు జడ్జిగా జస్టిస్ ప్రసన్న

కొలీజియం సిఫారసు

న్యూఢిల్లీ: కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రసన్న బీ వరలేను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం శుక్రవారం సిఫారసు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలో శుక్రవారం కొలీజియం సమావేశం జరిగింది. దేశంలోని హైకోర్టు సీనియర్ న్యాయమూర్తుల్లో జస్టిస్ ప్రసన్న ఒకరని, అంతేకాకుండా ఆయన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల్లో ఆయన మాత్రమే ఎస్సీ వర్గానికి చెందినవారని తెలిపింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ 2023 డిసెంబరు 25న పదవీ విరమణ చేయడంతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేయడం కోసం తాజా సిఫారసు చేసింది.

21లోగా లొంగిపోండి

బిల్కిస్ దోషులకు సుప్రీం స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జనవరి 19: లొంగిపోవడానికి మరికొంత సమయం ఇవ్వాలని 'బిల్కిస్ బానో' దోషులు చేసిన విజ్ఞప్తిని సుప్రీం కోర్టు తిరస్కరించింది. గడువు పొడిగింపుపై వారు చూపిన కారణాలకు ఎలాంటి అర్హతలు లేవని ధర్మాసనం పేర్కొన్నది. గతంలో తాము జారీ చేసిన ఆదేశాల మేరకు లొంగిపోవాల్సిందేనంటూ శుక్రవారం ఆదేశించింది. దీంతో సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన తీర్పు మేరకు వారు ఈ నెల 21న న్యాయస్థానం ముందు లొంగిపోనున్నారు.

డేరా చీఫ్‌కు మరోసారి పెరోల్

చండీగఢ్: లైంగికదాడి కేసులో శిక్ష అనుభవిస్తున్న డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రాం రహీంకు 50 రోజుల పెరోల్ మంజూరైంది. రెండు నెలల క్రితం ఆయన 21 రోజుల పాటు జైలు నుంచి విడుదలయ్యారు. హర్యానాలోని రోహతక్ జిల్లా, సునరియా జైలులో ఆయన శిక్ష అనుభవిస్తున్నారు. ఆయన జైలు నుంచి తాత్కాలికంగా విడుదలైన సమయంలో ఉత్తర ప్రదేశ్‌లోని బాగ్‌పట్‌లో ఉన్న డేరా సచ్చా సౌదా ఆశ్రమానికి వెళతారు. ఇద్దరు శిష్యురాళ్లపై అత్యాచారం చేసినట్లు రుజువుకావడంతో ఆయనకు 20 సంవత్సరాల జైలు శిక్ష విధించిన సంగతి తెలిసిందే.

- జలదృశ్యం.. హిమ చిత్రం

ఇవేవో అందమైన మంచు శిల్పాల్లాగా ఉన్నాయే అనుకుంటున్నారా.. ఉత్తర కశ్మీర్‌లోని తాంగ్ మార్గ్ వద్ద నీళ్ల పైపులు లీక్ కావడంతో చలి తీవ్రతకు నీళ్లు ఇలా గడ్డ కట్టాయి.

ఒకే రోజు 11 మంది మహిళలకు సీనియర్ అడ్వకేట్ హోదా

- హైదరాబాదీతో పాటు మొత్తం 56 మందికి..

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ), జనవరి 19: సుప్రీంకోర్టు చరిత్రలో శుక్రవారం ఓ రికార్డు నమోదైంది. ఒకే రోజులో 11 మంది మహిళా న్యాయవాదులకు సీనియర్ అడ్వకేట్ హోదాను కల్పించి చరిత్ర సృష్టించింది. సర్వోన్నత న్యాయస్థానం చరిత్రలో ఇప్పటి వరకు కేవలం 12 మంది మహిళలకు మాత్రమే ఈ హోదా ఉంది. తాజాగా 11 మంది మహిళలు సహా మొత్తం 56 మందికి సీనియర్ అడ్వకేట్ హోదా ఇచ్చారు. శుక్రవారం ఈ హోదాను పొందినవారిలో శోభా గుప్తా, స్వరూపమ చతుర్వేది, లిజ్ మాథ్యూ, కరుణ నుండి, ఉత్తర బబ్బర్, హరిప్రియ పద్మనాభన్, అర్చన పాఠక్ దవే, షిరిన్ ఖజురియా, ఎన్ఎస్ నప్పినాయ్, ఎస్ జనని, నిషా బాగ్చి ఉన్నారు. 2019లో ఆరుగురు మహిళా న్యాయవాదులకు సీనియర్ అడ్వకేట్ హోదా లభించింది. సుప్రీంకోర్ట్ తొలి మహిళా న్యాయమూర్తిగా జస్టిస్ బీవీ నాగరత్న 2027 సెప్టెంబర్ 25న ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉన్నది. తాజాగా సీనియర్ అడ్వకేట్ హోదా లభించిన వారిలో హైదరాబాద్‌కు చెందిన శ్రీధర్ పోతరాజు ఉన్నారు. సుప్రీంకోర్టులో జరిగిన శ్రీరామజన్మభూమి కేసు విచారణలో కీలక పాత్ర పోషించారు. విచారణ సులభతరం కావడానికి 36 వేల కీలక పత్రాలను డిజిటలైజ్ చేశారు.

దేశీయ తొలి హెపటైటిస్ ఏ టీకా ఆవిష్కరణ

న్యూఢిల్లీ, జనవరి 19: దేశీయంగా అభివృద్ధి చేసిన తొలి హెపటైటిస్ ఏ టీకా హవిష్యూర్‌ను హైదరాబాద్‌కు చెందిన ఇండియన్ ఇమ్యూనోలాజికల్స్ లిమిటెడ్(ఐఐఎల్) శుక్రవారం ఆవిష్కరించింది. 'క్లినికల్ పరీక్షల్లో ఈ టీకా సురక్షితం, సమర్థవంతమైనదిగా నిరూపితమైంది' అని ఐఐఎల్ ఎండీ ఆనంద్ కుమార్ తెలిపారు. ప్రముఖ బహుళ జాతి సంస్థల టీకాలతో దీన్ని పోల్చి చూడొచ్చన్నారు. ఏడాదికి పైగా వయసున్నవారు హవిష్యూర్ మొదటి డోసును తీసుకోవచ్చు. మొదటి డోసు తీసుకొన్న ఆరు నెలల తర్వాత రెండో డో స్ తీసుకోవాలి. కలుషిత ఆహారం లేదా నీటి ద్వారా హెపటైటిస్ వ్యాపిస్తుంది.

22న బాలల పురస్కారాల ప్రదానం

న్యూఢిల్లీ: అసాధారణ విజయాలు సాధించిన 19 మంది బాలలకు ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం ప్రదానం చేస్తారు. కళలు, సంస్కృతి విభాగంలో ఏడుగురికి, సాహస కృత్యాలు, నవ కల్పన, సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాల్లో ఒక్కొక్కరికి, సామాజిక సేవ విభాగంలో నలుగురికి, క్రీడా విభాగంలో ఐదుగురికి ఈ పురస్కారాలను ఇస్తారు. 18 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన 10 మంది బాలికలు, తొమ్మిది మంది బాలురు ఈ పురస్కారాలను స్వీకరిస్తారు. ఈ కార్యక్రమం విజ్ఞాన్ భవన్‌లో జరుగుతుంది.

అమెరికాలో ఓ కార్గో విమానానికి ఆకాశంలో మంటలంటుకొన్నాయి. మియామీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి అట్లాస్ ఎయిర్ కంపెనీకి చెందిన బోయింగ్ 747-8 కార్గో విమానం గురువారం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఎడమవైపు ఉన్న ఇంజిన్‌కు మంటలంటుకొన్నాయి. దీంతో అదే ఎయిర్‌పోర్టులో విమానాన్ని అత్యవసరంగా దించేశారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి హాని జరుగలేదని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై విచారణ జరుపుతున్నామని పేర్కొన్నారు. విమానానికి మంటలు అంటుకొన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కొద్దిరోజుల క్రితమే న్యూయార్క్‌లోని జాన్ ఎఫ్ కెన్నడీ విమానాశ్రయంలో ఓ ప్రయాణికుల విమానానికి మంటలంటుకొన్నాయి.

మరాఠా కోటా కోసం 26న ఆమరణ దీక్ష: జరాంగే

ముంబై, జనవరి 19 (నమస్తే తెలంగాణ): మరాఠాలకు ఓబీసీ రిజర్వేషన్ కోసం తాము చేపడుతున్న ఉద్యమం చివరిదని, 26న చేపట్టే ఆమరణ నిరాహార దీక్షతో మరాఠాల డిమాండ్ నెరవేర్చాల్సిందేనని ఉద్యమ నేత మనోజ్ జరాంగే పాటిల్ స్పష్టం చేశారు. శనివారం అంతర్వాలి గ్రామం నుంచి వేలాది మంది మరాఠాలతో కలిసి ముంబై బయలుదేరారు. జనవరి 26న ఆజాద్ మైదానంలో ఆమరణ నిరాహారదీక్ష చేపట్టనున్నట్టు తెలిపారు. మరాఠాల రిజర్వేషన్లపై సీఎం షిండే, అజిత్ పవార్, ఫడ్నవీస్ దృష్టి పెట్టాలన్నారు. మరాఠాలను మోసగించేందుకు అనుమతించనని, 54 లక్షల మందికి ఓబీసీ సర్టిఫికెట్లు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు.

లొకేషన్ మార్కర్‌గా విక్రమ్ ల్యాండర్

నిద్రాణ స్థితిలోనూ సేవలు

బెంగళూరు, జనవరి 19: జాబిల్లి దక్షిణ ధ్రువంపై దిగిన విక్రమ్ ల్యాండర్ అంచనాలకు మించి సేవలు అందిస్తున్నది. విక్రమ్ ల్యాండర్‌లోని 'ది లేజర్ రెస్టో రిఫ్లెక్టర్ ఎరే(ఎల్ఆర్ఏ) పరికరం చంద్రుడి దక్షిణ ధ్రువంపై లొకేషన్ మార్కర్‌గా పని చేస్తున్నట్టు శుక్రవారం ఇస్రో ఒక ప్రకటనలో తెలిపింది. గతేడాది డిసెంబర్ 12 నుంచి నాసాకు చెందిన లూనార్ రికనైసెన్స్ ఆర్బిటల్ ఎల్ఆర్ఏ నుంచి సంకేతాలను గుర్తించినట్టు పేర్కొంది. అంతర్జాతీయ సహకార ఒప్పందంలో భాగంగా నాసాకు చెందిన ఎల్ఆర్ఏను విక్రమ్ ల్యాండర్‌లో పొందుపరిచారు. ఇందులో అర్ధ గోళాకారంలో ఉన్న 8 కార్నర్ క్యూబ్ రిఫ్లెక్టర్లు ఉంటాయి. ఏదైనా అంతరిక్ష నౌక ద్వారా విడుదలైన లేజర్ కిరణాలను ఇవి వికిరణం చేస్తాయి. చంద్రుడిపైకి వివిధ ఎల్ఆర్ఏలు పంపినప్పటికీ, మిగతా వాటితో పోలిస్తే చంద్రయాన్-3లోని ఎల్ఆర్ఏ పరిమాణంలో చిన్నది. చంద్రుడి దక్షిణ ధ్రువంలో సేవలందిస్తున్న ఎల్ఆర్ఏ ఇదొక్కటే. 20 గ్రాముల బరువుండే ఈ పరికరాన్ని భవిష్యత్తులో దశాబ్దాల పాటు సేవలందించేలా రూపొందించారు. చంద్రయాన్ -3 ప్రాజెక్టులో భాగంగా విక్రమ్ ల్యాండర్ గతేడాది ఆగస్ట్ 23న చంద్రుడి దక్షిణ ధ్రువంపై విజయవంతంగా దిగింది. 14 రోజులపాటు ప్రజ్ఞాన్ రోవర్‌తోపాటు జాబిలిపై పరిశోధనలు చేసింది. భూమికి విలువైన సమాచారాన్ని చేరవేసింది.



చంద్రుడిపై కాలుమోపిన జపాన్ స్లిమ్!

సాఫ్ట్‌ల్యాండింగ్ చేసిన ఐదో దేశంగా ఘనత

టోక్యో, జనవరి 19: చందమామపై పరిశోధనలకు జపాన్ ప్రయోగించిన స్మార్ట్ ల్యాండర్ ఫర్ ఇన్వెస్టిగేటింగ్ మూన్(ఎస్ఎల్ఐఎం-స్లిమ్) శుక్రవారం చంద్రుడి ఉపరితలంపై దిగింది. అంతరిక్ష నౌకను 'పిన్‌పాయింట్ టెక్నాలజీ' ఉపయోగించి చంద్రుడి మధ్య రేఖకు దక్షిణంగా సమీపంలోని ఒక బిలం వాలుపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసినట్టు జపాన్ అంతరిక్ష సంస్థ(జక్సా) ప్రకటించింది. ఈ ఘనత సాధించిన ఐదో దేశంగా జపాన్ నిలిచింది. లక్ష్యానికి 100 మీటర్ల(328 అడుగుల) దూరంలో జపాన్ అంతరిక్ష సంస్థ(జక్